విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్ననాడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. కిషోర్ బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రత్తిపాడు సిఐ మాట్లాడుతూ డ్రగ్స్‌కి బానిసలైన యువత తమ జీవితాలను ఏ విధంగా నాశనం చేసుకుంటున్నారో వివరించారు. యువత సరైన మార్గంలో పయనిస్తే ఉన్నతమైన శిఖరాలను అందుకుంటారని అందరూ చక్కని వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలన్నారు. కళాశాలకు వచ్చేటప్పుడు గాని వెళ్లేటప్పుడు గాని విద్యార్థులను ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థినులకు ఎటువంటి వేధింపులు ఎదురైన వెంటనే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. ఎస్సై సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుపై మాదక ద్రవ్యాలు ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని అందువల్ల వీటికి లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ సదస్సుకు అధ్యాపకులు బి. రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వొలుపు కనకరాజు, కేశవరావు, జి అనిల్ కిరణ్, ఏ ప్రతాప్, రఘురాం, ఉషా మాధురి, జ్యోతి, రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు బుధవారం 2 సర్కిళ్ల పరిధిలోని పేర్రాజుపేట, శ్రీనగర్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నప్పటికీ కొంతమంది క్రింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రజలు తడి పొడి-చెత్తను వేరువేరుగానే ఇవ్వాలని స్పష్టం చేశారు. సేకరించిన చెత్తను విభజించి హూపర్ టిప్పర్ వాహనాలలో తరలించాలని ఆదేశించారు. ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ మేరకు చెత్తను సేకరించే ఏజెన్సీకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ఈ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా 5 డివిజన్‌లలో పూడిక తీత పనులను ఏడిసి నాగ నరసింహారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ జిలానీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రమేష్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి ఈతకోట రమేష్ కు సౌత్ ఆఫ్రికాదేశంలో గణా లోగల వేదిక్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందజేసింది. కళాశాల పూర్వ విద్యార్థి 2019 కోవిడ్ సమయంలో రోగులకు విశేష సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ డి. సువర్ణ రాజు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థి ఈతకోట రమేష్ కు గౌరవ డాక్టరేట్ లభించటం తమకు గర్వకారణమే అన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు లెక్కచేయకుండా రమేష్ బాబు విశేష సేవలు అందించారని సువర్ణ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఈతకోట రమేష్ బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కే సూర్యారావు, జీడీ లీల, సరిపల్లి వెంకటేశు , కమల, సీతారత్న సూర్య కుమారి, వేణుమాధవి, చప్పట్లు శివ నాగ ప్రసాద్, అయ్యప్ప, సతీష్, కంబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - రౌతులపూడి : రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో ఈనెల 13వ తేదీన సంభవించిన ఈదురు గాలులు పిడుగుపాటు ప్రభావంతో కూలిన చెట్టు కింద ప్రమాదవశాత్తుపడి గిడజ గ్రామానికి చెందిన పులుగు రాజులు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రౌతులపూడి గ్రామానికి చెందిన వైద్యులు గంటా గోపి సతీమణి అడ్వకేట్ గంటా శ్రీలక్ష్మి స్పందించి బాధిత పులుగురాజు కుటుంబానికి 25 కేజీల బియ్యం, 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సహాయాన్ని పులుగు రాజులు భార్య సీతకు బుధవారం శ్రీలక్ష్మీ అందజేశారు. మండలంలో పరిసర గ్రామాలలో ఏ పేద కుటుంబానికి కష్టమొచ్చిన వెళ్లి తన వంతు సహాయం అందించే శ్రీలక్ష్మిని గిడజాం గ్రామస్తులు పలువురు అభినందించారు.

కొంకుదురు పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర - బిక్కవోలు : మన రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, విద్యార్థుల సర్వముఖాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహమిస్తోందని కొంకుదురు గ్రామ సర్పంచ్ సత్తి వీరమణి రాజా అన్నారు. స్థానిక కొంకుదురు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పడాల శివసాయి నారాయణ, గొలుగూరి గీతాహాసిని, కోరుకొండ యువ సూర్య శ్రీరామ్ ల తరపున వారి తల్లిదండ్రులకు వరుసగా 3000, 2000, 1000 నగదు బహుమతులను అందజేసారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు మల్లిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పి.వి, వైఎస్సార్సీపీ నాయకుడు రొంగల అప్పాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

కౌలు రైతుల కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : కౌలుదారులకు మేలు చేయాలన్న సంకల్పంతో పంట సాగుదారుల హక్కు పత్రాల చట్టంతో ప్రభుత్వమే కౌలు కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని సర్పంచ్ గొల్ల హేమతులసి సురేష్ అన్నారు. బుధవారం కుతుకులూరులో కౌలు రైతులకు సర్పంచ్ హేమ తులసి, వైస్ ఎంపీపీ పులగం బుల్లి రెడ్డి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్తి దొరయ్య రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లిన ఆటో

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం అమీనాబాద్ నుండి గొల్లప్రోలు గ్రామాల్లోకి వెళ్లి చేపలు విక్రయించేందుకు మహిళలు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆటో పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వచ్చేసరికి రోడ్డుపైన ఉన్న సునకాన్ని తప్పించబోయి సమీపంలో ఉన్న బిల్డింగ్‌లోకి దూసుకెళ్ళిన సంఘటన చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్‌కి మరో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దోపిడి

జీతం కంటే, పై ఆదాయమే ఎక్కువ

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆ కార్యాలయంలో నిత్యం రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అటువంటి కార్యాలయంలో కొందరి హవా కొనసాగుతోంది. వారికి జీతాలు కంటే పై ఆదాయమే ఎక్కువగా వస్తున్నది. స్థలం, పొలం అమ్మలన్నా, కొనాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుండి రుణాలు కావాలన్నా తనఖా రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వీటిని అదునుగా చేసుకుంటున్నారు రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరు అధికారులు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులతోపాటు, మామూళ్లను రిజిస్ట్రేషన్ ఉద్యోగులు అమ్మకాలు, కొనుగోలుదారుల నుండి దండిగా వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ విలువపై 10 నుండి 20 శాతాన్ని ఖర్చుల రూపంలో వసూళ్ళు చేస్తున్నారు. ఈ తతంగమంతా లేఖర్ల ద్వారానే జరుగుతుంది. రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వానికి, చెల్లించాల్సిన ఫీజులతో పాటూ, అధికారుల వసూళ్ళు అక్కడే జరిగిపోతాయి. సాయంత్రం అన్నీ పూర్తయ్యాక విలువను బట్టి ఉద్యోగస్తుల జేబుల్లోకి వెళ్లిపోతుంటాయి. ఇలా రోజుకు 20 నుండి 30 వరకు రిజిస్ట్రేషన్‌లు, తనఖా జగ్గంపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతుంటాయి. దీని ద్వారా రిజిష్టర్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి జీతం కంటే మామూళ్ల ఆదాయమే ఎక్కువ వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ కార్యాలయం నియోజకవర్గ కేంద్రంలో ఉండటంతో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన వారు ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. ఇక్కడ నిత్యం రిజిస్ట్రేషన్లు జరుగుతుండటంతో ప్రభుత్వానికి అధిక ఆదాయంతో పాటు సిబ్బందికి అధిక ఆదాయం వస్తున్నదని పలువురు పేర్కొంటున్నారు. ఈ కార్యాలయంలో ఉండే సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, ప్రైవేట్ సిబ్బంది కుడా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయంలో ప్రైవేట్ సిబ్బందే ఎక్కువగా ఉండటంతో వారిదే హవాగా కొనసాగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ సిబ్బంది కావటంతో వారికి ట్రాన్స్ ఫర్లు ఉండవు. వారికి అదే బలం. నిత్యం ఇక్కడే ఉండే సిబ్బంది కావడంతో ఏ అధికారి వచ్చినా వారిదే అజమాయిషీగా కొనసాగుతోంది. ఇటీవల అసిస్టెంట్ ఉద్యోగి రావడంతో కార్యాలయ అజమాయిషీ అంతా ఆయన ఆధీనంలోకి వెళ్ళిపోయింది. దీంతో ప్రైవేట్ ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ కార్యాలయంపై నిఘా ఏర్పాటుచేసి, మామూళ్లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

విశాలాంధ్ర - జగ్గంపేట : మాదకద్రవ్యాలకు బానిసై కొంతమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, అలా బానిసలు కావొద్దని జగ్గంపేట సీఐ బి. సూర్య అప్పారావు సూచించారు. జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ సూర్య అప్పారావు హాజరై మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, సిగరెట్లు వంటి మాదకద్రవ్యాలకు బానిసై కొంతమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ వ్యసనాల వలన యువత విద్యార్థి దశలో ఉరకలెత్తాల్సిన వయసులో శక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ఆలోచన సన్నగిల్లుతుందన్నారు. చదువుకోవాలన్న ధ్యాస తగ్గిపోవడంతో పాటు చేస్తున్న పనిపై ఏకాగ్రత తప్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈ చంద్రనాయుడు, కాలేజీ సిబ్బంది, జగ్గంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ డీప్ వాటర్ రోడ్డులో 21వ తేదిన కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, మరియు ఆయుష్ శాఖ వారు నిర్వహించిన 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ యోగాను ప్రపంచం అంతా గుర్తించిందని, మనం కూడా మన జీవన శైలిలో సమయం కుదుర్చుకొని భాగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ యోగాని ఆచరించడం అనేది నేటి హడావిడి జీవితంలో కొంచెం కష్టంతో కూడుకున్న పని అయినా, మన ఆరోగ్యవంతమైన శరీరం కోసం తప్పనిసరిగా ఆచరించాలన్నారు. యోగా అనేది శరీరం,మెదడు, ఆత్మలకు సంబంధించిన విషయం అని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు మాట్లాడుతూ యోగా అభ్యసనం అందరూ అలవాటు చేసుకోవాలని, ఎన్నో శారీరక రుగ్మతలకు యోగా ఒక ఔషదం వంటిదని తెలుపుతూ ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె కరుణ మాట్లాడుతూ ప్రపంచమంతా బుధవారం యోగా దినోత్సవాన్ని చాలా ఆసక్తితో జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి రామారావు, సీ పోర్ట్ లిమిటెడ్ సిఇఓ ఆయుష్ మంత్రిత్వశాఖ సభ్యులు, బ్రహ్మ సమాజ సభ్యులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. నాగశ్రీకాంత్, కళాశాల జాతీయ కార్యనిర్వహణాధికారులు కుమారి ఎన్. హేమశ్రీ, పిబిటి సురేఖ, పి. సాయికుమార్, కె. వంశీ, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పి. సత్యవతి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ బిసి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కాకినాడ సూర్య కళామందిర్‌లో జరిగే ఆంధ్రప్రదేశ్ బిసిల ఆత్మగౌరవ సభకు సంబంధించిన ఏర్పాట్లు కార్యాచరణ ప్రణాళికపై బిసి సంఘాలు బిసి కుల సంఘాల ప్రతినిధులు బుధవారం మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆఫీసులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవ సభకు అన్ని బీసీ సంఘాల, బీసీ కుల సంఘాల నాయకులతో పాటు బీసీలందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇది ఏ రాజకీయ పార్టీకి, సంఘానికి సంబంధించిన సమావేశం కాదని, బీసీల ఆత్మగౌరవం కోసం నిర్వహిస్తున్న సమావేశం అని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా 25వ తేదీన జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి(న్యూ ఢిల్లీ) మల్లాడి కృష్ణారావుని ఆహ్వానించి కార్యక్రమం ఏర్పాట్లు వివరాలను వివరించడం జరిగింది. దీనిలో భాగంగా కాకినాడ సమావేశంలో మల్లాడి కృష్ణారావుని బిసి సంఘాల ప్రతినిధులు సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ బిసిలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతానని, అన్ని ప్రభుత్వాల, రాజకీయ పార్టీల దృష్టికి బిసిల సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయకర్త పప్పు దుర్గా రమేష్, బహుజన యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్, మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్, జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెబ్బిలి రవికుమార్, ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి వివిఎస్ గోపాలకృష్ణ, రమ్య హాస్పిటల్ అధినేత ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్సిపి డాక్టర్స్ విభాగం అధ్యక్షులు పితాని అన్నవరం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

సర్పంచ్ చొరవతో డయాలసిస్ పేషెంట్‌కు చికిత్స

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని శివకోటి గ్రామ పంచాయతీ పరిధిలోని మట్ల గ్రామానికి చెందిన ఒక యువతి డయాలసిస్‌తో ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నక్క రామారావు వెంటనే స్పందించి బుధవారం 108 వాహనం ద్వారా ఆ యువతిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేసారు. సర్పంచ్ రామారావు చేసిన మంచి పనిని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా జి.యువరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసంద్రంగా ముమ్మిడివరం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రలో భాగంగా ముమ్మిడివరం జనసంద్రమైంది. భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. కోనసీమ ప్రాంతానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రతి ఒక్కరితో మాట్లాడి అర్థమయ్యేలా చెప్తే గొడవలు జరిగేవి కాదని ప్రభుత్వం వల్లే గొడవలు జరిగాయని అన్నారు. ప్రతి ఎకరాకు ఒక బస్తా ద్వారంపూడి కుటుంబానికి వెళ్తుందని రైతు కన్నీరు మీద ద్వారంపూడి కుటుంబీకులు వ్యాపారం చేస్తున్నారని అన్నారు. వారాహి యాత్ర కు వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్ వైసిపి ప్రజా ప్రతినిధులు విమర్శలు ఎక్కు పెడుతున్నారని తెలిపారు. వైసీపీని ఓడించడానికి ఎన్ని వ్యూహాలైనా అమలు చేస్తానని ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చనివ్వనని వచ్చే ఎన్నికల్లో జనసేనకు ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు, యువత, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పోలవరం వంతెన

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం మండపం సెంటర్ 16వ నెంబర్ జాతీయ రహదారి వద్ద గల పోలవరం కాలువ పై నిర్మించిన వంతెన ప్రారంభించకపోవడంతో వంతెన మందుబాబులకు అడ్డాగా మారింది. కోట్లాది రూపాయలు నిర్మాణం వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ఏమైందో ఏమో గాని అధికారులు ప్రారంభించకుండా అసంపూర్తిగా అలానే వదిలేశారు. చీకటి పడితే ఈ పోలవరం కాలువ వంతెన పై మందుబాబులు గుంపులు గుంపులుగా మద్యం సేవిస్తు బీభత్సం సృష్టిస్తున్నారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి వివాహాలు దూర ప్రాంతాలు వెళ్లినప్పుడు రాత్రివేళ అటువైపు రావడానికి హడలిపోతున్నారు. వేగంగా వెళదామంటే రోడ్డు మొత్తం కాలువ నిర్మాణానికి ధ్వంసం అయింది. అనేకమార్లు ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయమై స్పందించి పోలవరం కాలువ వంతెనను ప్రారంభించి సమస్యకు పరిష్కారం చూపిస్తారని వాహనదారులు, ప్రజలు వేడుకుంటున్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా

విశాలాంధ్ర - కాకినాడ : 2016 సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న 16 సంవత్సరముల ఒక మైనర్ బాలికను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా అనుభవించి పెళ్ళి చేసుకోవడానికి నిరాకరించిన వైబోగుల వీర వెంకట రమణ ఏ శ్రీను సన్‌ఆఫ్ సత్తిబాబుపై బాధితురాలి ఫిర్యాదు మేరకు జగ్గంపేట పోలీస్ స్టేషన్ నందు సిఆర్ నెం.134/2016 యుఎస్ 417, 376 (2)(1) ఐపిసి & సెక్షన్ 5(1) ఆర్/డబ్ల్యు 6 ఆఫ్ పోసోయాక్ట్‌గా అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎండి ఎంఆర్ ఆలీఖాన్ కేసు నమోదు చేయగా పెద్దాపురం ఎస్‌డిపిఒ రాజశేఖర రావు సమగ్ర దర్యాప్తు చేపట్టి కోర్టు నందు ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఇటీవల జరిగిన ట్రైల్‌లో పోక్సో కోర్ట్ స్పెషల్ పిపి పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించగా పోక్సో స్పెషల్ కోర్ట్ జడ్జి ఎల్. వెంకటేశ్వర రావు మైనర్ బాలికను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా అనుభవించి పెళ్ళి చేసుకోవడానికి నిరాకరించిన ముద్దాయికి 10 సంవత్సరాల జైలు శిక్ష , రూ. 12000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువ రించారు.

సచివాలయాల్లో ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని బొబ్బర్లంక గ్రామంలో జగనన్న సురక్ష పై సచివాలయ స్థాయిలో అవగాహనా సదస్సు పంచాయతీ కార్యదర్శి నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఆత్రేయపురం ఎంపీడీఓ నాతి బుజ్జి, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాస రాజు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. అ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని, ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయకుండ ధ్రువపత్రాలు జారీ చేస్తారని తెలియజేసారు. మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాస రాజు మాట్లాడుతూ వాలంటీర్లు, గృహసారధులు ప్రతీ కుటుంబాన్ని సందర్శించాలని, కన్వీనర్లు మరియు మండల స్థాయి అధికారులు ప్రతీ గ్రామములో గ్రామ సభలు నిర్వహించి, అవసరమైన సర్టిఫికేట్లు,సర్వీసులు అందిస్తారని తెలిపారు. ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ జూలై నెల 1వ తేదీ నుండి జరుగు జగనన్న సురక్షలో భాగంగా గ్రామ సచివాలయాల్లో జారీ చేసే కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యారేజ్ సర్టిఫికేట్, ఫ్యామిలీ మెంబర్, సర్టిఫికెట్లు, ఆధార కార్డులో మొబైల్ నెంబర్ అప్ డేట్, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డు నమోదు, కౌలు గుర్తింపు కార్డులు తదితర 11 రకాల సర్వీసుల కొరకు ఈ నెల 24 తేదీ నుండి వాలంటీర్లు, గృహా సారదులు ప్రతి కుటుంబాన్నీ సందర్శించి, అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని, జూలై1 నుండి జరిగే గ్రామ సభల్లో ఉచితంగా సర్టిఫికేట్లు అందిస్తారని తెలిపారు.



పవన్ కళ్యాణ్ జనవాణి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : వారాహి యాత్రలో భాగంగా ముమ్మిడివరం విచ్చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మండలం లోని కొమనపల్లి ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో బుధవారం రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వాణిజ్య వర్గాల ప్రతి నిధులు, జనసేన వీర మహిళలతో జనవాణి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు పలు సమస్యలను ప్రతినిధులు వివరించారు.

రౌతులపూడి ఎంపీపీపై దాడి ప్రభుత్వ వ్యతిరేక చర్య

విశాలాంధ్ర - రౌతులపూడి : మండల అధ్యక్షురాలు గంటిమల్ల రాజ్యలక్ష్మి పై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రంలోని మండల అధ్యక్షులు రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఏలేశ్వరం మండల అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎంపీపీల సమాఖ్య అధ్యక్షులు మేకల హనుమంతరావు మాట్లాడుతూ గిరిజన మహిళా మండలి అధ్యక్షురాలు పై గ్రామంలోని కొందరు వ్యక్తులు ఇంటి మీదకు వచ్చి దాడి చేసి కొట్టి కులం పేరుతో దూషించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో చాలా దారుణం అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక చర్యఅన్నారు. ఒక గిరిజన మహిళా ప్రజా ప్రతినిధిని కొట్టి దూషించడం చాలా అమానుషమని ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని తూర్పుగోదావరి జిల్లా ఎంపీపీల సమైక్య అధ్యక్షురాలు జి. జోత్న్న ఆవేదన వ్యక్తం చేశారు. సామర్లకోట మండల అధ్యక్షులు బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ గిరిజన మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి పై దాడి దురదృష్టకర సంఘటన అని ప్రజాస్వామ్యంలో క్షమించరాని నేరమని అన్నారు. దాడులకు పాల్పడిన దోషులను చట్టరీత్యా వెంటనే శిక్షించాలని లేనిపక్షంలో జిల్లా ఎస్పీ, కలెక్టర్లను సంప్రదిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి ఎంపీపీలు, మండలంలోని గ్రామ సర్పంచులు, వైయస్సార్ పార్టీ యువజన నాయకులు వాసిరెడ్డి జమీలు, వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలంగిలో ఏసీబీ సోదాలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణకు చెందిన భీమవరం లోని ఆయన నివాసంతో పాటు, తణుకు, ఉండ్రాజవరం మండలం పాలంగి లో ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన సబ్బి ఎస్టేట్ ల లోను ఏకకాలంలో అధికారులు సోదాలు నిర్వహించినట్లు ఎసిబి డిఎస్పి పి. శరత్ బాబు చెప్పారు. ఉదయం 6 గంటల నుండి తనిఖీలు కొనసాగుతున్నట్లు డి.ఎస్.పి తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ ఎంపిక పోటీలు

విశాలాంధ్ర -తాళ్లపూడి: వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కొరకు ఎంపిక పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యం లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట రమణ తెలిపారు. క్రీడా విభాగపు ఉపాధ్యాయులు సిబ్బంది తో బుధవారం సమావేశం నిర్వ హించారు. 24 తేదీన రాష్ట్ర స్థాయి ఎంపిక జరుగుతుందని, దీని లో భాగంగా 24 న మండల స్థాయి పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా పాఠశాలల్లో పోటీలకు సంబంధించిన వివరాలు తెలుస్తాయని అన్నారు. ఎంపీడీఓ చైర్మన్‌గా ఓ బృందం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులు అర్హులని, వీరు లాంగ్ జంప్, పరుగు పందాలు వంటి ఆటల పోటీలు వుంటాయని అన్నారు. 23 న మండల స్థాయి, 24న జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని, వివరాలకు గజ్జరం హై స్కూల్ పి.డి. విజయకుమార్‌ను కలవాలని తెలిపారు.

కార్మిక శాఖ దాడులు

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండల కేంద్రమైన తాళ్లపూడిలో చాలా రోజుల తరువాత బాల కార్మికుల నిర్మూలన కై కార్మిక శాఖ, పోలీస్ శాఖ సంయుక్తం గా మార్కెట్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తాళ్లపూడి మెయిన్ బజార్ లోని వీరన్న బాబు కూరగాయల షాపులో సుంకర ప్రసన్నకుమార్ అనే బాలుడు పనిచేస్తుండగా యజమాని పై కేసు నమోదు చేశామని కార్మిక శాఖాధికారి శేఖర్ తెలియ జేశారు. బాల కార్మికుల తో పని చేయించడం చట్ట రీత్యా నేరమని, బడి ఈడు పిల్లలతో భిక్షాటన చేయించే వారి పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజశేఖర్‌కు సత్కారం

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు వివాద రహితులని, ఎంతో మంచివారని, దాదాపు మూడున్నర సంవత్సరాలు ఎంపీడీఓగా తనను ఎంతో గౌరవంగా చూశారని, ఇక్కడ సిబ్బంది కూడా చెప్పిన పనిని కచ్చితంగా చేస్తారని తాళ్ళపూడి మండలం నుండి బదిలీ పై నల్లజర్ల మండలానికి వెళ్లిన ఎం.రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వీడ్కోలు పలుకుతూ తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయం లో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, పాలకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ రాజశేఖర్ శైలిని మెచ్చుకున్నారు. శాఖల వారీగా, అధికారులు, నాయకులు, రాజశేఖరుని పూల మాలతో, శాలువాలతోను ముంచెత్తి అభిమానాన్ని చాటుకున్నారు. ఏ.ఎస్.ఓ జోడాల వెంకట్, ప్రస్తుత ఎంపీడీఓ వెంకట రమణ, తహశీల్దార్ రాధిక, ఈవోపిఆర్డీ వీరన్న, ఎంపీపీ పోసిరాజు, జెడ్పిటిసి శ్రీలేఖ, వైస్ ఎంపీపీ కోదాటి కనకమ్, వైకాపా నాయకులు తదితరులు రాజశేఖర్‌ను సత్కరించారు.

సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కరప మండలం : నడకుదురు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్, గ్రామ ధర్మకర్త సింగంపల్లి వెంకట రామకృష్ణ, గండేటి వెంకటరమణ, చీపురుపల్లి జయేంద్ర బాబు, గ్రామపెద్దల సంయుక్త ఆధ్వర్యంలో గురజానపల్లి ఆయుష్ శాఖ యోగాగురువు పెంకే లోవరాజు సారథ్యంలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, హెల్త్ అవేర్ అధ్యక్షులు అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా అలయన్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మనం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలన్నా అది యోగ తోనే సాధ్యమన్నారు. విశిష్ట అతిథి వనుం శ్రీనివాసరావు మాట్లాడుతూ నడకుదురు గ్రామంలో స్వచ్ఛందంగా యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిసి వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో యోగా దినోత్సవం సందర్భంగా ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. అనంతరం యోగా గురువు లోవరాజు సభ్యులకు యోగాసనాల విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి అలై పెంకే గోవిందరాజు, అలై వనుం ఉపేంద్రనాథ్, అలై సిహెచ్ గణేష్ మరియు క్లబ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెదపాడు హైస్కూల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-పెదపాడు: పెదపాడు జెడ్పీ హైస్కూల్లో బుధవారం మండల స్థాయి లో ఆర్థిక అక్షరాస్యత పై ఆర్బీఐ అఖిలభారత క్విజ్-2023 ను నిర్వహించారు. పెదపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.బి.ఐ సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో జడ్.పి.హెచ్.ఎస్ వట్లూరు విద్యార్థులు పి. సాయి కనకదుర్గ ,కర్రే కార్తీక్, సత్యవోలు జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎల్. రోహిత్ రామ్, డి.ముత్తయ్య, వీరమ్మ కుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జి లహరి, జే పూజశ్రీ వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారన్నారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు 5000 ,4000 ,3000 రూపాయలు నగదు బహుమతులను, ధ్రువీకరణ పత్రాలను అందించడం జరిగిందని వెంకటేశ్వర రావు చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఎన్ రాకేష్, పెదపాడు, సత్య వోలు, వట్లూరు, వీరమ్మ కుంట, అప్పన వీడు, పాత ముప్పర్రు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన ధర్మరాజు పలువురికి పరామర్శ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన మేక శ్రీనివాసరావు ఇటీవల గుండెకి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ పత్స మట్ల ధర్మరాజు పరామర్శించారు.ధర్మరాజు వెంట చింతలపాటి బాసిరాజు ,తోట శ్రీను,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొల్లేపల్లి దుర్గ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఉరాడల్ల వెంకటేశ్వరరావు, మనే సత్యనారయణ, కుంపట్ల జగదీష్,కార్యదర్శులు బొడపాటి రామయ్య, సంయుక్త కార్యదర్శులు మనే ప్రశాంత్, ఘంటసాల వెంకటరత్నం, బోడపాటి వెంకన్న, గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని వేడంగి పెనుమదం గ్రామాలలో బుధవారం కౌలు రైతులకు రెండు రెవిన్యూ బృందాలు అవగాహన సదస్సులు జరిపాయి. బహుళ ప్రయోజనాలు కలిగిన కౌలు కార్డు లను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కృష్ణారావు సూచించారు.మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ డి. రాజేష్, ఆర్ఐ రాంబాబు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు గ్రామ రెవిన్యూ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టీ నరసాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు పడాల సత్యనారాయణ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ప్రాముఖ్యత తెలియజేస్తూ బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రముఖ యోగా గురుపులు రాయల దుర్గా రావు, మోరుపాక సత్యనారాయణ చారిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా శారీరక మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన తెలిపారు.

శ్రీవాసవిలో అంతర్జాతీయ యోగ దినోత్సవం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విభాగం 1 మరియు 2వ యూనిట్లకు సంభందించిన విద్యార్థులు కళాశాల నుండి పెదతాడేపల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ పలు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ర్యాలీని ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు బిఎస్‌హెచ్ విభాగాధిపతి శ్రీ ఎన్. రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా విచ్చేసిన మాజీ సైనికాధికారి డి.వెంకటేశ్వర రావు యోగా గురించి అద్భుతమైన ప్రసంగం చేశారు, స్వయంగా పలు యోగా ఆసనాలను కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ కార్యదర్శి శ్రీ చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి శ్రీ బాల కాశయ్య, టెక్నికల్ డైరక్టర్ శ్రీ చెక్కా అప్పారావు, ఇంజనీరింగు కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరరాజు ఆయా ఎన్ఎస్ఎస్ విభాగాల కో ఆర్డినేటర్లు, వివిధ విభాగాల అధిపతులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయి ప్రియా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రరంలో యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా మనిషి ఆరోగ్యానికి ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. యోగా చేయడం వలన శారీరక, మానసిక, ఉల్లాసము, జ్ఞాపక శక్తిని, చురుకుదనాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. అనంతరం జ్యోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రపంచానికి భారత్ అందించిన అతి గొప్ప బహుమతుల్లో యోగా కూడా ఒకటని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ గొల్లప్రోలు సైనికులు కొశిరెడ్డి రాజా, జిల్లా యోగ భారత్ ఫౌండేషన్, వ్యవస్థాపక అధ్యక్షులు, సాయిప్రియ సేవాసమితి అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్, సాయి ప్రియా సేవా సమితి చైర్మన్ జ్యోతుల గంగాభవాని, భారతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకృష్ణ దేవరాయ వెంకట్రావు, యోగా అభిలాషులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా యోగా దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాంగణంలో గల ఇంజనీరింగ్, ఫార్మసీ, పోలిటెక్నిక్ మరియు బిజినెస్ స్కూల్ నందు ఆయా కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో యోగా వర్క్ షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో పసుమర్తి సీతారమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. సీతారాంను ప్రిన్సిపల్ డా ఆదిరెడ్డి రమేష్ ఘనంగా సత్కరించారు. ఫార్మసీ కళాశాలలో 72 ఏళ్ల యోగా శిక్షకుడు డాక్టర్ వి సత్యనారాయణ మూర్తి విద్యార్థులందరికీ యోగాను ప్రదర్శించారు. మరో అభ్యాసకుడు ఎస్.విష్ణు చక్రం శిక్షణలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆదిత్య మేనేజ్‌మెంట్ తరఫున ప్రిన్సిపల్ డా డి సతీస్‌కుమార్ ఇద్దరు కోచ్‌లను దుస్సలువాతో సత్కరించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌ల చేతులమీదుగా యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డా ఎం శ్రీనివాసరెడ్డి, డా డోలా సంజయ్, డా కే రవిశంకర్, డా సంజయ్ కుమార్, ఎస్‌టివిఎస్ కుమార్ వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌లు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణమైన ఆరోగ్యం

విశాలాంధ్ర -కైకలూరు : ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చు అని సీనియర్ సివిల్ జడ్జి షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగ ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. దీనివల్ల న్యాయవాదులు కోర్టు సిబ్బంది పలు విధాలైన యోగాసనాలు సాధన చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్ ఎస్ రాజు, సెక్రటరీ బి లక్ష్మణరావు, జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి, మహిళా ప్రతినిధి ఎండి రజిమున్నిసా, లైబ్రరీ సెక్రెటరీ కె. రమాదేవి, సీనియర్ న్యాయవాదులు పి. పవన్ కాంత్, ఎపిపి వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, ఏజీపీఎం పాములు, గురజాడ ఉదయ్ శంకర్, కే శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి మనిషి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే యోగ తప్పనిసరిగా రోజుకి అరగంట పాటు చేయాలని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్, శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం అధ్యక్షులు రుద్దరాజు వెంకట సూర్యనారాయణరాజు (ఆర్ వి ఎస్ రాజు) అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా వర్తక సంఘ భవనంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ యోగ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ వి ఎస్ రాజు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల క్రితం భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మొదలుకొని గ్రామ గ్రామాల్లో కూడా ఈ యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలతో యోగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-పెదపాడు: సామాన్యుని నుంచి శాస్త్రవేత్త వరకు నయా పైసా ఖర్చు లేకుండా యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పెదపాడు జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగ దే సందర్భంగా బుధ వారం పాఠశాలలో విద్యార్థులచే యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వెంకటేశ్వర మాట్లాడుతూ యోగ భారతదేశపు పురాతన ఆరోగ్య రహస్యం అన్నారు. యోగా సాధకులు తమ మనస్సును ఏకోన్ముఖం చేసి ప్రాణాయామం, ధ్యానం లను అభ్యాసం చేస్తే శరీర ఆనందంతో పాటు ఆత్మానందం పొందవచ్చునని అన్నారు. యోగాసనాలు వేసే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలి అన్నారు. ప్రపంచీకరణ కారణంగా జీవనశైలి మారుతున్న నేపథ్యంలో శారీరిక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగ ఓ అద్భుతమైన సాధనం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా మార్చుకుని ఆనందంగా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు భారతీయ సంస్కృతి నుంచి లభించిన అమూల్యమైన బహుమతి యోగ అన్నారు. విద్యార్థులు యోగాను ప్రతిరోజు చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ కె విజయ, ఫిజికల్ డైరెక్టర్లు నాయుడు, సునీల్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో : యోగాతో చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. ఏపీ నిట్ లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. నిత్యం యోగ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్, ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ రాముడు, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ జగన్ మోహనరావు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్యారాణి, బీటెక్, ఎంటెక్, పీహెచ్ డి విద్యారులు పాల్గొన్నారు.

పోడూరులో : 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలం లోని జిన్నూరులో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం యోగ దినోత్సవం జరిపారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ఎన్ గిరీష్ 400 మంది విద్యార్థులతో వివిధ యోగాసనాలు వెయ్యించారు ప్రతీ రోజు యోగాసనాలు వేస్తూ అనారోగ్యం రాకుండా కాపాడుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. అనంతరం మెయిన్ రోడ్డులో విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు, ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు జమ్ము రామలక్ష్మణరావు ఆయుర్వేద డిస్పెన్సరీ ఎంఎన్ఓ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో అంతర్జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలేం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఐ ట్రిపుల్ ఇ వైజాగ్ బే సెక్షన్‌తో కలిసి జూన్ 23-24, తేదీల్లో అడ్వాన్స్‌డ్ & గ్లోబల్ ఇంజనీరింగ్ ఛాలెంజెస్ (ఏజిఇసి)పై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ "ఏజిఇసి-2023" ఆధునిక సైన్స్ & టెక్నాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థాయి పరిశోధన & తాజా ఆవిష్కరణలను సహకరించడానికి మరియు ప్రదర్శించడానికి విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు & శాస్త్రవేత్తలకు అద్భుతమైన అంతర్జాతీయ వేదికగా ఉంటుందని. ఈ సదస్సు యొక్క ప్రధాన ఇతివృత్తం "సుస్థిర అభివృద్ధి కోసం తదుపరి తరం సాంకేతికత".అని వివరించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - బిక్కవోలు : తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో సామూహిక యోగ కార్యక్రమం పాఠశాల వ్యాయామదర్శకులు లయన్ ద్వారంపూడి యువ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తాడి జయ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రాణాయామాలు యోగాసనాలు సూర్య నమస్కారాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులచే వ్యాయామ దర్శకులు యువ రాజారెడ్డి చేసి చూపిస్తూ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా యువరాజా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో బిజీగా మారుతున్న జీవన విధానంలో యోగా ద్వారా మానవుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠ శాల ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పి జి టి ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్, హై స్కూల్ ఎలిమెంటరీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అనపర్తిలో: యోగా రోజువారీ జీవితంలో సమతుల్య వైఖరిని కొనసాగించే మార్గాలను పెంపొందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా స్థానిక జిబిఆర్ యోగ క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 365 రోజులు క్రమం తప్పకుండా యోగ చేసిన పెద్ద రాజు ను ఎమ్మెల్యే గోల్డ్ మెడల్, శాలువాతో సత్కరించగా యోగా క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్), తేతలి త్రినాధ రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్), నల్లమిల్లి సాయి రామారెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ కర్రి సునీల్ రెడ్డి, సత్తి రామారెడ్డి, సిఐ విప్పర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో : శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో ఇంటర్నేషనల్ యోగా డే యోగా గురువు, ఆయుర్వేదం ఫిజియోథెరపీ వైద్యుడు యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా అనగా మన మానవులకు దేవుళ్ళు ఇచ్చిన వరం, ఆ వరాన్ని పొందిన మనం ప్రతిరోజు యోగాసనాలు చేస్తూ మన ఒంట్లో ఉన్న వ్యాధుల్ని తగ్గించి ఏ వ్యాధి రానివ్వకుండా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించొచ్చునని అన్నారు. యోగాసనాలు చేస్తే మన ఒంట్లో బ్లడ్ సర్క్యులేషన్ బాగా అయి, కీళ్ల నొప్పులు, బీపీ షుగర్, మలబద్ధకం, గ్యాస్టిక్ ప్రాబ్లం, గుండెకి సంబంధించిన వ్యాధులు, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు, మన బాడీలో ఉన్న అవయవాలు అవయవాలకి ఏ వ్యాధి రానివ్వకుండా కాపాడేదే యోగా అన్నారు.

కొత్తపేటలో : స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేటలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్. అరుణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ కె. కనకరాజు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కుంచే పెద్దిరాజు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. దైనందిన జీవితంలో యోగ మెడిటేషన్ ఎక్సర్సైజులు తప్పనిసరిగా చేయాలని, నడక, వ్యాయామం వలన మనిషి జీవన ఆయుష్షు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డిసిహెచ్ పాపారావు, కెఅంకమ్మరావు, కే సత్యనారాయణ, టి రమాదేవి, శివాజీ, శ్రీలక్ష్మి, విజయ్ కుమార్, నాగరాణి, భవాని, పవన్, ప్రసన్న జ్యోతి, సాయి కృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోటలో: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఆయుష్ ఆయుర్వేద కేంద్రంలో ఆయుర్వేద వైద్య అధికారి డాక్టర్ షాహజద్ అలీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అలీ మాట్లాడుతూ యోగాతో ఆత్మస్థైర్యం, ఆరోగ్యం, ఆనందం పొందవచ్చని యోగాతో అనేక రుగ్మతలను నివారించవచ్చునని అన్నారు. యోగ అధ్యాపకులు మామిడి లక్ష్మణ్ కుమార్, మండా జగదాంబ విద్యార్థులతోనూ హాజరైన ప్రముఖులతోనూ యోగాసనాలు, ప్రాణాయమము, ధ్యానము చేయించి వాటి వల్ల ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్ లక్ష్మణరావు, మరియు సచివాలయ సిబ్బంది, ఆయుష్ వైద్య సిబ్బంది ఎన్ చంటిబాబు, కాటన్ దొర, రాజశేఖర్, భాను, గ్రామ ప్రజలు విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

అనపర్తిలో :స్థానిక జిబిఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ పి ఆర్ ఎల్ స్వామి, ఎస్ పి అబ్బాయి రెడ్డి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగా అభ్యసనంతో మానసిక, శారీరక ఆరోగ్యం దృఢపడుతుందని తెలిపారు. ట్రైనర్ నవీన్ ఆధ్వర్యంలో పలు రకాల యోగాసనాలు వేయించడం జరిగింది ఎన్ఎస్ఎస్ జూనియర్, డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్లు పి వి వెంకటేశ్వరరావు, సి హెచ్ ఆనందరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ రాజు, జీవన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి ఆశయాలు నెరవేరేలా మానవత సభ్యులు కృషి చేయాలని మానవత జిల్లా కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని పాలంగి మానవత ఉండ్రాజవరం కార్యాలయ భవనం వద్ద నిర్వహించిన మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న వారిని మానవత వెంటనే ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి గాను ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షునిగా కడలి మాణిక్యాల రావు, ఉపాధ్యక్షులుగా కఠారి సిద్ధార్థ రాజు, సుంకవల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి, వి వి ఎస్ ఎన్ ప్రసాద్, కోశాధికారి, జాయింట్ సెక్రటరీ గా కంటిపూడి లక్ష్మీపతి లు, ఈసీ సభ్యులుగా కోడూరి శ్రీనివాసరావు, అయిశెట్టి విజయరావు, మన్నే శ్రీనివాసరావు, ఉన్నమట్ల శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వెలిచేటి బోసు, పూర్వపు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోడీ 9 ఏళ్ల పాలనపై ప్రచారం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రపంచంలోనే యోగాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనుడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని తూర్పుగోదావరి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి కృష్ణా భగవాన్ అన్నారు. దేశప్రధానిగా మోడి పగ్గాలు చేపట్టి 9ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోడీపాలన, పేదల కోసం అందించిన సంక్షేమాలపై బీజేపీ నేతలు మండల కేంద్రమైన రాజానగరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యోగా డే ప్రపంచ వ్యాప్తంగా 175 దేశాల మద్దతు ఇచ్చాయని, అందుకు మన ప్రధాని మోడీ అందించిన కృషిని కొనియాడారు. జిల్లా కోశాధికారి అడబాల గణపతిరావు మాట్లాడుతూ నేటి సమాజానికి యోగ ఒక దివ్య ఔషధం లాంటిదన్నారు.అనంతరం చక్రద్వారబందం గ్రామంలో ఇంటింటికి స్టిక్కర్లు అంటించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ సంగిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా బీజేపీ విస్తారక్ శివాజీ, జిల్లా మహిళా మోర్చా కన్వీనర్ రజిని, మండల అధ్యక్షులు పేపకాయలు కాశీ, జిల్లా సెక్రెటరీ బోయిడి దుర్గారావు,మండల ఉపాధ్యక్షులు సంగిశెట్టి సత్యనారా యణ, అసెంబ్లీ ఐటీ సెల్ కన్వీనర్ ఆళ్ల శివ నాగరాజు, కోరుకొండ మండల ప్రధాన కార్యదర్శి సత్తిరాజు సుబ్రహ్మణ్యం,తదితరులు పాల్గొన్నారు.

యోగతో మానసిక వికాసం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతిరోజు యోగ సాధన చేయడం ద్వారా శారీరక అభివృద్ధి,మానసిక వికాసం పొందవచ్చు నని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ 9వ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని మండలంలోని వివిధ విద్యాసంస్థలు నందు యోగ దినోత్సవ వేడుకలు బుదవారం ఘనంగా నిర్వహిం చారు. దీనిలో భాగంగా నన్నయ్య వర్సిటీ నందు కానవరం రాపర్తి రామ యోగ ఇన్స్టిట్యూట్ కి చెందిన డాక్టర్.ఎంవిజీఎస్ శర్మ, ప్రిన్సిపాల్ ఎన్.శివ శంకర్, యోగ టీచర్ కె.అప్పలరాజు ఆధ్వర్యంలో యోగాసనా లపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కూడా యోగా పై వివిధ కోర్సులు ప్రవేశపెడతామని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ఎస్.టేకి స్మారక ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ వైద్య కళాశాలలో :యోగ క్రమం తప్పకుండా చెయ్యడం ద్వారా మానసిక ఒత్తిడికి దూరం కావచ్చునని జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. అంతర్జాతీయ 9వ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రగణంలో బావి వైద్యులతో కలిసి యోగ తరగతులు నిర్వహించారు.

గైట్ కళాశాలలో :అంతర్జాతీయ తొమ్మిదవ యోగ దినోత్సవం సందర్భంగా గైట్ ప్రాంగణంలోని వివిధ కళాశాలలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోదావరి విద్యాపీఠం స్కూల్ :మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని గోదావరి విద్యాపీఠం స్కూల్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సేవా ఉగాది ఆధ్వర్యంలో యోగా గురుపులు ఎం.వి.వి.రమణ అధ్యక్షతన వివిధ యోగ పోటీలు నిర్వహించారు.

టిడ్కో ఇళ్ళు లబ్దిదారులకు అందించకుంటే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మ అధ్యక్షతన పిఠాపురం టౌన్ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం పట్టణ టౌన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మొదలు పెడుతున్నామని తెలియజేసారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల తక్షణమే లబ్దిదారులకు అందజేయాలని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు అన్ని సౌకర్యాలతో కూడిన టిడ్కో అపార్ట్ మెంట్స్ సుమరుగా 1000 కుటుంబాలకు కేటాయించారని, ఈ ప్రభుత్వం వచ్చాక కక్షపూరితంగా వ్యవహరిస్తూ కోపంతో నేటికి లబ్దిదారులకు అందజేయకుండా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కరరావు, కొండేపూడి సూర్యప్రకాష్, కోరుప్రోలు శ్రీను, సోము సత్యనారాయణ, సురవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి మారటం లేదు

ఎటూ తేలని మున్సిపల్ వివాదం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మున్సిపాలిటీలో గత వారం జరిగిన కొట్లాట ఎటూ తేలకుండా అయోమయంలో పడింది. ఆదివారం మంత్రి సమక్షంలో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. వివాదాన్ని సర్దుబాటు చేయాల్సిన మంత్రి మిన్నకుండటం పై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే మొత్తం వ్యవహారం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణకు అప్పగించడంతో మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకోవడం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మున్సిఫల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి రాజీనామా పై రేగిన ఉత్కంట కొనసాగుతోంది. అయితే చైర్మన్ రాజీనామా చేస్తారు అనడంతో ఆశవాహులు బయటకు వచ్చేసారు. తాము చైర్మన్ అంటూ మొదలు పెట్టేసారు. ముఖ్యంగా 15 వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మీ పేరును ఒకరు ముందుకు. తీసుకు రాగా మంత్రికి భద్ద శత్రువుగా వ్యవహరిస్తున్న వాసంశెట్టి సుభాష్‌కి సన్నిహితంగా ఉండే వసర్ల కుటుంబానికి ఇచ్చే ప్రసక్తే వుండదంటున్నారు.

తన భార్యకు ఇవ్వాలని దొంగ చిన్నా పట్టుబడుతున్నారు. గతంలోనే తెరమీదకు వచ్చిన సుంకర పార్వతి పేరు మరోసారి వినిపిస్తోంది. అసలు చైర్మన్ రాజీనామా చేస్తారా అనేది సస్పెన్స్. నాలుగేళ్ళ కాల పరిమితి పూర్తి అయితే గాని చైర్మన్ పై అవిశ్వాసం పెట్టడం కుదరదని చట్టం చెబుతుంది. పార్టీ ఆదేశిస్తే ఆమె రాజీనామా చేస్తోందా. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న ఈ తరుణంలో ఇటువంటి మార్పులకు అధిష్టానం ఒప్పుకుంటుందా. కేసు నమోదు చేయడానికి కూడా వీలు లేని సంఘటనను పట్టుకుని చైర్మన్ రాజీనామా చేయమనడం ఎంతవరకు సమంజసం అని ఆమె వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడనుంది.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో శ్వాసకోశ నాళాలకు సంబంధించిన అనారోగ్యంతో మరణించిన రాజమండ్రపు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎంపీపీ తోట రవి, పరామర్శించి, ప్రభుత్వం అందజేసిన వైఎస్ఆర్ బీమా పథకం చెక్‌ను ఆయన చేతుల మీదుగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవరం సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, జగ్గంపేట మార్కెట్ కమిటీ ఎఎంసి డైరెక్టర్ తోట విష్ణు, వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.